సార్.. ఇక్కడ ఓ లుక్కేయండి!

ఓపెన్ నాలాలపై పార్కింగ్, డంపింగ్‌లు



భగత్‌సింగ్‌నగర్ చివరి గల్లీలో వరద నీటి కాలువలపై అక్రమ పార్కింగ్



- ధ్వంసమవుతున్న నాలా పై కప్పులు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- సాఫీగా వెళ్లని వరదనీరు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

చింతల్: వర్షాకాలం వచ్చిన ప్రతిసారి నగరంలో బస్తీలు, కాలనీలు నీట మునుగుతున్న విషయం తెలిసిందే. పలు బస్తీలు కాలనీలలో పురాతన నాలాలు, మురుగు కాలువలు రోజురోజుకు కుషించుకుపోయి వర్షం వచ్చిన సమయంలో వరద నీరు ఇళ్లలోకి చేరుతున్న విషయం తెలిసిందే. ఉన్న నాలాలను వర్షాకాలానికి ముందే పరిశుభ్రం చేసి వాటి ద్వారా మురుగు అదే విధంగా వర్షం నీరు వెళ్లేందుకు ఉన్న బాక్స్ నాలాలను అందుబాటులోకి తెచ్చి నీరు వెళ్లేందుకు సిద్ధంగా ఉంచాల్సిన అధికారులు, స్థానికులు సంక్షేమ సంఘం నేతలు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- మరోవైపు వాట్సాప్ నీరు వెళ్లేందుకు ఉండే బాక్స్ నాలాలు మురుగు కాలువలు భూగర్భ డ్రైనేజీ ఓపెన్ నాలాలలో వ్యర్థాలు తొలగించి వాటిని ఆధునికరించాల్సిన అధికారులు విఫలమయ్యారు. దీనికి తోడుగా తామేమి తక్కువ కాదనట్లు స్థానికంగా ఉండే ఇండ్లు భావన యజమానులు నాలాలను ఇష్ట రాజ్యాంగ మార్చేసుకుంటున్నారు. నాలాలపై తమ ఇంటి సామాగ్రిని వాహనాలను పార్కింగ్ చేస్తూ వాటిని నిరుపయోగంగా మారుస్తున్నారు.
- చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్, చంద్రనగర్ రంగనగర్, శివనగర్ చింతల్ తదితర బస్తీలు కాలనీలు వర్షం వచ్చిన ప్రతిసారి నీట మునుగుతున్నాయి. ఈ బస్సులు కాలనీలో ఉన్న ఓపెన్ నాలాలు బాక్స్ నాలాలు శిథిలావస్థకు చేరిన స్థానిక సంక్షేమ సంఘం నేతలు గాని అధికారులు గాని పట్టించుకోవడం లేదన్నది తేటతెల్లమవుతోంది. హెచ్‌ఎంటీ జంగల్ నుంచి వచ్చే వరద నీరు నేరుగా విజయనగర్ కాలనీ భగత్‌సింగ్‌నగర్ చింతల్ చంద్రనగర్‌లో మీదుగా గణేష్‌నగర్ నాలాలు కలుస్తున్న విషయం తెలిసిందే.



భగత్‌సింగ్‌నగర్ - చంద్రానగర్ రోడ్డులో నాలాపై పోసిన కంకర

నిరుపయోగంగా మారిన బాక్స్ నాలాలు...

వందలాది ఎకరాల్లో విస్తరించిన హెచ్‌ఎంటీ పరిశ్రమ ఖాళీ జాగా మీదుగా వచ్చే వరద నీరు నేరుగా విజయనగర్ కాలనీ భగత్‌సింగ్‌నగర్‌తో పాటు దాని కింద ఉన్న బస్తీలు కాలనీల ద్వారా మురుగు, వరద నీరు గణేష్‌నగర్ నాలాలో కలుస్తాయి.

- భగత్‌సింగ్‌నగర్‌లో హెచ్‌ఎంటీ మీదుగా వచ్చే వరద నీటి బాక్స్‌నాలాపై స్థానికులు ఇష్టారాజ్యంగా చిన్న, భారీ వాహనాలను సైతం ఈబాక్స్ నాలాపైనే అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. కొందరు ఇంటి నిర్మాణ సామగ్రిని డంప్ చేస్తున్నారు. దీంతో బాక్స్ నాలాపై వేసిన సిమెంటు శ్లాబ్‌లు ధ్వంసమవుతున్నాయి. చెత్తాచెదారం అందులో పడటంతో వరద నీరు సాఫీగా వెళ్లడం లేదు. కొంతమంది బాక్స నాలాపైనే మిక్సింగ్ మిల్లర్ వాహనాలు, ట్రాక్టర్లు, కార్లు, టెంట్ హౌస్, డెకరేషన్ సామాన్లను ఇక్కడ పెడుతున్నారు. దీనిపై అక్రమ పార్కింగ్, సామగ్రి డంపింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నాలాపై పేర్చిన ఇటుకలు, పక్కనే ధ్వంసమైన బాక్స్ నాలా మూతలు



చంద్రానగర్‌కు వెళ్లే దారిలో నాలాపై పోసిన డెబ్రీస్

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



రామకృష్ణనగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

కుత్బుల్లాపూర్: ఎస్సీ వర్గీకరణతో మాదిగ, ఉపకులాలకు రిజర్వేషన్లతో న్యాయం జరుగుతుందని మేడ్చల్ జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు రాసమల్ల యాదగిరిమాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం చింతల్ రామకృష్ణనగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ కల త్వరలోనే సాకారం కానుందన్నారు. ఆ దిశగా ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ చేపట్టనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్‌మాదిగ, జిల్లా యువసేన ప్రధాన కార్యదర్శి ఇసురం రమేష్ మాదిగ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సలోమి, లక్ష్మి, స్వరూప, శశికళ, కురుమయ్య, కిషన్, నిరంజన్, గడ్డం కురుమయ్య, జార్జ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యం

నిజాంపేట్: ఎస్సీ వర్గీకరణ సాధించడమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని నాయకులు అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బాచుపల్లి సాయినగర్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదిగ జర్నలిస్ట్ ఫోరం జాతీయ నాయకుడు ముక్కెర్ల లాలయ్య మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు, ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టేలా ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జర్నలిస్ట్ ఫోరం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మేడే సంజీవ, తెలంగాణ మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్, ఎం.శ్రీను, బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబ శివారెడ్డి, కేసీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు జలగం చంద్రయ్య, కార్యకర్తలు భారతి, లక్ష్మి, జహంగీర్, ఉప్పలయ్య, ఎం. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట బస్టాండ్‌లో...

జగద్గిరిగుట్ట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ బస్టాండ్‌లో ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు లింగయ్య, బాబు మాదిగ, ఎర్ర యకన్న ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డప్పు రామస్వామి, జోగు వెంకట్, కొమ్ము వెంకన్న, ఎర్ర సోమయ్య, గాదరి బాబు మాదిగ, ఆనంద్ మాదిగ, ఎల్లయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.





జగద్గిరిగుట్ట, సాయినగర్‌లలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేయాలి

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని తెలంగాణ ఉద్యమకారులు అందరికీ న్యాయం చేయాలని ముదిరెడ్డి అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 8వ తేదీన మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇస్తామని తెలిపారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం, ప్రభుత్వ గుర్తింపు కార్డు, పెన్షన్, సంక్షేమ పథకాల్లో వాటే తమ ప్రధాన డిమాండ్ అన్నారు. ఉద్యమకారులు ఉదయం 11గంటల వరకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌కు చేరుకోవాలని కోరారు

పార్కింగ్‌లకు అడ్డాగా రహదారులు



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆనుకుని రోడ్డును కబ్జాచేసి సొంతానికి వాడుకుంటున్న దృశ్యం



రోడ్డుకు మరో వైపు మెకానిక్ షెడ్డు నిర్వాహకుడు వాహనాలను నిలిపిన దృశ్యం

రంగారెడ్డినగర్: లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లు పార్కింగ్‌లకు అడ్డాగా మారుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీనగర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి హిందూ శ్మశాన వాటిక వరకు రూ.25 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో సీసీ రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే అంబేడ్కర్ విగ్రహం పక్కనే ఉన్న ఓ ఇంటి యజమాని రోడ్డుకు ఒక వైపు ఇనుప కడీలను ఏర్పాటు చేసి సొంతానికి వాడుకుంటున్నాడు. రోడ్డు పైనే వాహనాలను పార్కు చేయడంతో వాటర్ ట్యాంక్‌ను సైతం అమర్చి కబ్జా చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో పలు కథనాలు వెలువడినా సంబంధిత అధికారులు మాత్రం స్పందించడం లేదు. ఇదే అదనుగా భావించిన ఓ మెకానిక్ షెడ్డు నిర్వాహకుడు రోడ్డుకు మరో వైపు వాహనాలను నిలిపి రిపేర్లు నిర్వహిస్తున్నాడు. రెండు వైపులా రోడ్డు ఆక్రమణలకు గురి కావడంతో కార్లు, ఇతర భారీ వాహనాలు రాకపోకలు సాగించేందుకు ఆస్కారం లేకుండాపోతోంది. దీంతో శ్మశాన వాటికకు దహన సంస్కారాలకు వచ్చే వాహనాలు వెళ్లేందుకు దారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజావసరాలకు వేసిన రోడ్డు అక్రమణలకు గురి కావడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సదరు వ్యక్తులను ఈ విషయమై ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు స్పందించి రోడ్డు అక్రమణలను తొలగించి సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక తో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అప్పలరాజు(42), రాజేశ్వరిలు తమ ఇద్దరి పిల్లలతో 12 ఏళ్లక్రితం నగరానికి వలస వచ్చి దూలపల్లిలోని అయ్యప్ప కాలనీలో నివాసముంటున్నారు. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన అప్పలరాజు తాగుడుకు బానిసై అప్పులు చేశాడు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులు తీవ్రతరం కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన అతను శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతుడు బానోతు రాజేష్‌కుమార్

కుత్బుల్లాపూర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ విజయ్‌నగర్‌కు చెందిన బానోత్ రాజేష్‌కుమార్ (28) కొంపల్లిలోని అపర్ణ పామ్ మిడోస్‌కు చెందిన సంజయ్ అగర్వాల్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా ఈ నెల 6వ తేదీన డ్యూటీకి వెళ్లిన రాజేష్‌కుమార్ రాత్రైనా ఇంటికి చేరుకోలేదు. అతని మొబైల్ నెంబర్‌కు ప్రయత్నించగా ఎత్తకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసిన ఫలితం లేకుండాపోయింది. దేవరయాంజాల్లోని సంజయ్ అగర్వాల్‌కు చెందిన తోటలోని గదిలో రాజేష్‌కుమార్ అపస్మారక స్థితిలో పడి ఉన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెళ్లి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని రంగాల్లో నియోజకవర్గ అభివృద్ధికి కృషి



వెంకన్న హిల్స్ ఫేజ్-2 కాలనీ నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ అన్నారు. ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలపై వినతులు అందజేయగా ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

కాలనీల అభివృద్ధికి నా సహకారం ఉంటుంది..

జీడిమెట్ల డివిజన్ వెంకన్నహిల్స్ కాలనీ ఫేజ్-2 కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వారిని అభినందించారు. కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నూతన అధ్యక్షుడు జయం చారి, ఉపాధ్యక్షుడు లక్ష్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి శ్రావణ్, కోశాధికారి రాజేందర్, సంయుక్త కార్యదర్శి పరంకుశం నాయుడు, కార్యనిర్వాహన కార్యదర్శులు సుభాష్, తిరుపతిరెడ్డి, దుర్గారావు తదితరులు ఉన్నారు.

రంగానగర్‌లో సీసీ కెమెరాలు ప్రారంభం

చింతల్ డివిజన్ రంగానగర్‌లో సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణే కాకుండా నేరాల దర్యాప్తును వేగవంతం చేయడంలో ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్, ఎస్‌ఐలు సతీష్ రెడ్డి, నాయుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మహమ్మద్ రఫీ, మక్సూద్ అలీ, కర్నెకంటి మల్లేష్, దేగా కృష్ణమూర్తి, శ్రీశైలం, బండారు వరప్రసాద్, జన్ను లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

కార్తీక్ నేచర్ స్పేస్ వెంచర్ సమస్యలు పరిష్కరించాలి..

సూరారం డివిజన్ కార్తీక్ నేచర్ స్పేస్ వెంచర్ వాసులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కాలనీలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు సమస్యలను పరిష్కరించాలని కోరుగా ఎమ్మెల్యేను సానుకూలంగా స్పందించారు. కాలనీవాసులు కళ్యాణ్ రాజు,అనిల్ కుమార్, వెంకట్ రెడ్డి, పవన్, మూర్తి, తిరుపతి గోపాల్‌రెడ్డి, నాగేశ్వర్ రావు, భాస్కర్, యోగేందర్, రవి తేజ, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూములు, చెరువులను పరిరక్షిస్తాం



పరికి చెరువు ఎఫ్‌టీఎల్‌లో వెలిసిన ఆక్రమణలను పరిశీలిస్తున్న శ్రీశైలంగౌడ్



పరికి చెరువు ఎఫ్‌టీఎల్‌లో ప్లాట్లు వేసిన దృశ్యం

జగద్గిరిగుట్ట: ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం జగద్గిరిగుట్ట భూదేవిహిల్స్‌లోని పరికి చెరువు ఎఫ్‌టీఎల్‌లో చోటు చేసుకుంటున్న కబ్జాలను ఆయన పరిశీలించారు. స్థానికంగా ఓ వ్యక్తి చెరువు ఎఫ్‌టీఎల్‌ను ప్లాట్లుగా చేసి అమాయక ప్రజలకు విక్రయిస్తున్నాడని ఫిర్యాదులు అందడంతో శ్రీశైలం గౌడ్ చెరువును స్థలాన్ని సందర్శించారు. సుమారు రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని సదరు వ్యక్తి కబ్జా చేయడంతో పాటు శ్మశానవాటిక గుండా రోడ్లు వేసినట్లు స్థానికులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ... కబ్జాలపై సీఎం రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు శాయశక్తులా కృషి చేస్తానన్నారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ ఆర్ఐ రజనీకాంత్, సీనియర్ నాయకులు రషీద్, మోతె శ్రీనివాస్‌యాదవ్, గణేష్, ఓరుగంటి నరేష్ గౌడ్, గుమస్తా మధుసూదన్, నరేందర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి భగవద్గీత, మెమొంటోలను అందజేస్తున్న మల్లారెడ్డి

దుండిగల్: భగవద్గీత పారాయణం ప్రతి ఒక్కరూ చేపట్టాలని.. అందులోని విషయాలు మనల్ని సన్మార్గంలో పయనింపజేస్తాయని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. భగవద్గీత జాగరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించి ఆదివారం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి భగద్గీత పుస్తకంతో పాటు మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమానికి భగవద్గీత జాగరణ వ్యవస్థాపకుడు యోగేష్ గురు, మల్లారెడ్డిలు హాజరై పలువురికి భగద్గీత పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భగవద్గీత పఠనం మనలో నూతన మార్పును తీసుకొస్తుందన్నారు. ప్రతినిత్యం పారాయణం చేయడం అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీసరి కృష్ణారెడ్డి, గోనె మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

జగద్గిరిగుట్ట: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డా. వైఎస్. రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఈనెల 8వ తేదీన షాపూర్‌నగర్‌లో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తెలిపారు. ఉదయం 9గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్

జగద్గిరిగుట్ట: భారతదేశంలో 60 శాతం ఉన్న బీసీలకు కేంద్రంలో మంత్రిత్వ శాఖ లేకపోవడం బీసీల దురదృష్టకరమని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. ఆదివారం కొంపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్లు, ప్రమోషన్లు కల్పించాలన్నారు. తెలంగాణలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేష్‌కుమార్, రంగు క్రాంతిగౌడ్, ఉపాధ్యక్షుడు అభిషేక్, ప్రచార కార్యదర్శి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

'చదువుతోనే కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుంది'

జీడిమెట్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించే వరకు కష్టపడి చదవాలని బీసీ సంక్షేమ శాఖ, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం శ్రీసోమవంశీయ సహస్రార్జున క్షత్రియ ప్రాంతీయ సమాజ్ ఆధ్వర్యంలో ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇన్‌స్పిరేషన్ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐఐటీ, ఎంబీబీఎస్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముందు సహస్రార్జున చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ.. చదువుకున్న విద్యార్థులతోనే కుటుంబం ఆర్థికంగా ఎదుగుతుందన్నారు. సమాజానికి చదువుకున్న వారి అవసరం ఎంతగానో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్కారి సమాజ్ పెద్దలు విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై సమీక్ష

హాజరైన 33 జిల్లాల కబడ్డీ అసోసియేషన్ల సభ్యులు

నిజాంపేట్: కాసాని కృష్ణముదిరాజ్, జేఎస్ గెలాట్ కబడ్డీ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ వార్షిక జనరల్ బాడీ సమావేశాన్ని బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో నిర్వహించారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి జగదీష్‌యాదవ్‌లతో పాటు అమెచూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు కాసాని వీరేష్ పాల్గొని రాష్ట్రంలో కబడ్డీ క్రీడాభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ, భవిష్యత్ పోటీలపై క్రీడాకారులకు శిక్షణ ఇచ్చే విషయాలపై చర్చించారు. ఈ సమావేశానికి తెలంగాణకు చెందిన 33 జిల్లాల కబడ్డీ అసోసియేషన్ల అధ్యక్షుల, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గాన్ని సన్మానించారు.

వైభవంగా జగన్నాథస్వామి ఉత్సవాలు



జగన్నాథ, సుభద్ర, బలరాములను దర్శించుకున్న సురేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: జగన్నాథస్వామి ఉత్సవాలు ఆదివారం సుభాష్‌నగర్‌లో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో చెక్కతో రూపొందించిన జగన్నాథుడు, సుభద్ర, బలరాములను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తులను రథంపై పురవీధుల గుండా ఊరేగించనున్నారు. ఈ పూజా కార్యక్రమంలో జగన్నాథ్ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివాజీ, సీనియర్ నాయకులు శేషు, దేవాలయ అధ్యక్షుడు అనంత్ కుమార్ పాండ, ప్రశాంత్ కుమార్, నరేంద్ర కుమార్‌దాస్, ప్రదేశ్వర్, సమీర్ చంద్ర మహంతి, శివ శంకర్ శెట్టి, హేమంత్ కుమార్ సాహు, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్‌ల అందజేత



చింతల్: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా షాపూర్‌నగర్‌కు చెందిన ఎస్ఎస్‌కే సమాజ్ నిర్వాహకులు ఆదివారం వివిధ పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, సమాజ్ ప్రెసిడెంట్ ప్రశాంత్‌లు హాజరై 50 మంది విద్యార్థులకు వాటిని అందజేశారు. సమాజిక అభివృద్ధిలో తమ వంతు సహాయం ఎల్లవేళలా ఉంటుందని ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ ప్రధాన కార్యదర్శి అశోక్, సంయుక్త కార్యదర్శి సతీష్, కోశాధికారి రాకేష్ తదితరులు ఉన్నారు.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నిజాంపేట్: కుటుంబ కలహాల నేపథ్యంలో చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని బాచుపల్లి పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన మేరకు.. బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన డ్రైవర్ నరేష్ (23), రాణిలు భార్యాభర్తలు. ఆదివారం ఉదయం భార్యతో గొడవ పడిన నరేష్ కోపంతో స్థానికంగా ఉన్న భైరుని చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న కానిస్టేబుల్ సత్యపాల్‌రెడ్డి వెంటనే చెరువు వద్దకు చేరుకుని నరేష్‌ను ప్రాణాలతో కాపాడాడు. భార్యాభర్తలిద్దరిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.